# యక్ష ప్రశ్నలు




హైద్రాబాద్ నగర్లోనే ఓ పెద్ద నది అది. అందులోని నీటికోసం వచ్చాడో వ్యక్తి.

''ఏయ్ మిస్టర్ సహదేవ్.... ప్లీజ్ స్టాప్‌దేర్ ఇట్‌సెల్ఫ్, డోంట్ టచ్ దిస్ వాటర్, ఐసే. ఆ నదిలో నీళ్ళు ముట్టకు'' ఖంగుమంటూ వినపడిందా గొంతు.

స్టీల్ బక్కెట్‌తో నీళ్ళు ముంచబోతున్న సహదేవ్ సడన్‌గా ఆగిపోయి, ''హూ.... ఆర్ యూ.... కమాన్ హెల్ప్‌మీ'' అరిచాడు.

''హ్హ....హ్హ....హ్హ.... నేను, మిస్టర్ యక్ష రావును. మర్యాదగా నేను అడగబోయే నా ప్రశ్నలకు సమాధానం చెప్పి, ఈ వాటర్ తీసుకెళ్ళు.... అర్థమయ్యిందనుకొంటా'' వినబడింది యక్షారావు గొంతు.

''పోరా ఇడియట్.... ఈ వాటరేమన్నా నీ అబ్బసొత్తనుకొన్నావా? నాతో పెట్టుకోకు... అయినా నాగురించి నీకు తెలిసినట్టులేదు, నేను స్టీల్ బక్కెట్‌తో నీళ్ళు ముంచుకొని వెంటనే పరిగెత్తిపోతాను.... నువ్వు నన్నప్పుడు చచ్చినా పట్టుకోలేవు'' హేళనగా నవ్వాడు సహదేవ్.

''యు ఆర్ గోయింగ్ ఓవర్ మిస్టర్ సహదేవ్'' అరిచాడు ఆ కనబడని యక్ష. అయినా వినని సహదేవ్ నీళ్ళు ముంచుకోగానే తెలుగు సినిమాల్లోలా కపిపని తంవాల్చేసి, చనిపోయాడు.

ఆ తరువాత వరుసగా వచ్చిన నకులం, అర్జున, భీమసేనులు కూడా ''దెబ్బకు ఠా.... పాండవ ముఠా'' అయిపోయారు.

ఎంతకు తిరిగిరాని తమ్ముళ్ళు 'ఏమయిపోయారో?' అనుకుని, కింగ్ ఆఫ్ జస్టిస్ దటీజ్ ధర్మరాజు. ఆ చిన్న నది దగ్గరకి వెళ్ళాడు.

అక్కడ—

తమ్ముళ్ళందరూ చచ్చిపడుండే సరికి అదిరిపడ్డాడు ధర్మరాజ్.

''వెల్‌కమ్ మిస్టర్ ధర్మరాజ్''

చుట్టూ చూశాడు ధర్మరాజ్, తనను పిలచిందెవరా అని.

''మిస్టర్ ధర్మరాజ్, నా మాటను కాదని, స్టీల్ బక్కెట్టుతో నీళ్ళు ముంచుకోబోయిన నీ నలుగురు తమ్ముళ్ళూ చనిపోయారు.... చూశావుగా. నీకు బ్రతకాలని ఉంటే నేనడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పు''

''అలాగే'' అన్నాడు ధర్మరాజ్.

''వెరీగుడ్ .... ఫస్ట్ క్వొశ్చన్ .... మనసుకన్నా వేగమైనది.... తొందరగా పయనించేది ఏది?

''ఆడోళ్ళకు తెలిసిపోయిన రహస్యం'' జవాబిచ్చాడు ధర్మరాజ్.

''గుడ్, కళ్ళుతెరుచుకొని నిద్రపోయేదెవరు?''



''సెన్సారు బోర్డు సభ్యులు'' ధర్మరాజ్ సమాధానం ఇచ్చాడు.

''శెహభాష్, కళ్ళు మూసుకుని మేల్కొనుండేదెవరు?''

''తెలుగు సినిమా ప్రేక్షకులు''

''భలే, చదవగానే, ఊరేసుకు చావాలనిపించేవి?''

''సినిమారివ్యూలు, సూపర్‌హిట్ సీరియల్స్''

''కంగ్రాట్స్, ఎంతవిన్నా అర్థంగానివి?''

''రేడియోలో ఉగాది కవితలు''

''అన్నింటికంటే చాలా ఎత్తులో ఉన్నవి?''

''నిత్యావసర వస్తువుల ధరలు''

''ఎదుటివారికి కన్నీరు తెప్పించేదెవరు?''

''కొందరు కార్టూనిస్ట్‌లు''

''వెరీగుడ్ మిస్టర్ ధర్మరాజ్.... నీ తమ్ముళ్ళను బ్రతికిస్తున్నాను. ఇదిగాక మరొక వరం కూడా కోరుకో?'' నవ్వుతూ వినబడింది యక్షారావు గొంతు.

ఆ మాటకు గట్టిగా నవ్వాడు ధర్మరాజ్.

''ఎందుకోయ్, అలా నవ్వుతున్నావా? ఆ'

''భలేవాడివోయ్ యక్షారావు.... ఈ ప్రశ్నలకు ఆన్సర్లు ఆంధ్రాలో ఎవరినడిగినా కరెక్ట్‌గా ఇదే చెబుతారు. అయినా ఇవేం ప్రశ్నలు. నేనడిగే ప్రశ్నలకి సమాధానం చెప్పగలవా?'' ఛాలెంజ్ చేసాడు ధర్మరాజ్,

''అడుగు'' కాచుకున్నాడు యక్షరావు,

''జయప్రద, శ్రీదేవిల వయస్సు కరెక్ట్‌గా చెప్పుచూద్దాం''

తేలమొహం వేసాడు యక్షరావు.

ఆ నదిదగ్గరకి నీళ్ళకోసం వెళ్ళే ప్రతిఒక్కరికీ ఇదే ప్రశ్న అడుగుతున్నాడు యక్షరావు. ఎవరూ సమాధానం చెప్పటంలేదు. అందుకే హైద్రాబాద్‌లో ఎవరికీ నీరు అందటంలేదు.

(నోట్ :- కేవలం హాస్యం కోసం రాయబడింది. ఎవరినీ నొప్పించాలని కాదు)

—కందమూరి జనార్థన్
14-4-63/బి, కయిన్‌కట్ వీధి.
చిత్తూరు-517 001

